# మరోసారి అవకాశమిస్తే రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తా..


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మున్నూరు కాపు కుటుంబసభ్యులు

- కులమతాలకు అతీతంగా నగర అభివృద్ధి
- అన్ని కులాలకు భవనాల నిర్మాణానికి నిధుల మంజూరు
- మున్నూరు కాపులకు రాజకీయంగా ప్రాధాన్యం
- అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా


మున్నూరు కాపు కుటుంబసభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

ఖలీల్‌వాడి, అక్టోబర్ 10: నిజామాబాద్ నగరంలో కులమతాలకు అతీతంగా అభివృద్ధి చేశానని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. నగరంలోని విజయ్ కిసాన్ మున్నూరు కాపు సంఘంలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ప్రతి మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశానని గుర్తుచేశారు. రాజకీయంగా మున్నూరు కాపులకు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. ఒకవైపు నిజామాబాద్ నగర అభివృద్ధి, మరోవైపు కులసంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తొమ్మిదేండ్లలో నిజామాబాద్ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దామని అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న మహాప్రస్థానం కన్నా ధీటుగా నిజామాబాద్‌లో వైకుంఠధామాలు నిర్మించామని స్వయాన పురపాలక, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ అభినందించినట్లు గుర్తుచేశారు. హైదరాబాద్ తరహాలో నిజామాబాద్ నగరంలో మినీ ట్యాంక్‌బండ్ నిర్మించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే బెస్ట్ మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మించినట్లు వివరించారు. ప్రతి కాలనీ, ప్రతి వీధిలో డ్రైనేజీలు నిర్మించామని, నగరంలోని ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో భాగంగా ఆర్‌యూబీ నిర్మించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశామని, విశాలమైన రోడ్లు, సెంటర్ మీడియన్ లైట్లు నగరం నలుదిక్కులా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చేందుకు టెండర్లు వేశామని ఎమ్మెల్యే బిగాల వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్లు, ఆడబిడ్డల పెండ్లికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు. మరోసారి అవకాశం ఇస్తే రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తానని మాటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఆకుల సుజాత, బీఆర్‌ఎస్ నాయకులు సూదం రవిచందర్, సి ర్ప రాజు, దారం సాయిలు, ము చ్కూర్ నవీన్, రామడుగు బాలకి షన్, కార్పొరేటర్లు ముచ్కూర్ లావ ణ్య, ఆకుల హేమతల, మాజీ కార్పొరేటర్ పుప్పాల విజయా భాజన్న, పంచరెడ్డి సూరి, గాండ్ల లింగం, ఎర్రం గంగాధర్, మల్కాయి మహేందర్, రంగు సీతారాం, పుప్పా ల రవి, పసుల సురేశ్, ఎట్టెం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన గౌడ కుటుంబసభ్యులు

## కులవృత్తులను ప్రోత్సహిస్తూ విద్యకు ప్రాధాన్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత


వర్ని రోడ్డులోని జనార్దన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నాయీబ్రాహ్మణ కుటుంబసభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

రాష్ట్రంలోని సెలూన్లకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తున్నదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. జనార్దన్ గార్డెన్స్‌లో నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. నాయీబ్రాహ్మణులది విశలేశ్వరునికే క్షవరం చేసిన చరిత్రఅని, అశ్వినీ దేవతల వారసులని పేర్కొన్నారు. నాయీబ్రాహ్మణులు లేకుంటే సమాజానికి ఎంత ఇబ్బంది ఉంటుందో సీఎం కేసీఆర్ ఎన్నోసార్లు అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. నాయీబ్రాహ్మణుల కులవృత్తిని కాపాడేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా 35వేల సెలూన్లకు సబ్సిడీ విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. కులవృత్తులను ప్రోత్సహిస్తూ మరోవైపు విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలు కులవృత్తులను నిర్లక్ష్యం చేశాయని, కేసీఆర్ ప్రభుత్వం కులవృత్తులను ఆదరిస్తున్నదన్నారు. బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో మొట్టమొదట తీర్మానం చేసిన నాయకుడు సీఎం కేసీఆర్ అని తెలిపారు. 60ఏండ్లు దేశాన్ని ఏలినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇవన్నీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.కాంగ్రెస్ హయాంలో బీసీ గణన ఎందుకు చేపట్టలేదో రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలన్నారు. రెండుసార్లు ఆశీర్వదించి గెలిపించారని, మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీని, ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తాను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

- కులవృత్తులకు పూర్వవైభవం తెస్తున్న నేత సీఎం కేసీఆర్
- తెలంగాణలో ఉన్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాదు.. బీసీల ప్రభుత్వమే
- గౌడ, నాయీబ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- కులవృత్తులకు అండగా సీఎం కేసీఆర్ : అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా


గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మహిళను ఆప్యాయంగా పలుకరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

## పనిచేశాం.. మీ వద్దకు వస్తున్నాం

# ఆశీర్వదించండి


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే బిగాల, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్

ఖలీల్‌వాడీ, అక్టోబర్ 10: కులవృత్తులకు పూర్వవైభవం తీసుకొస్తున్న నేత సీఎం కేసీఆర్ అని, పని చేశాం.. హక్కుగా మీ వద్దకు వస్తున్నాం.. ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రజలను కోరారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ గౌడ సంఘంలో గౌడకులస్తుల ఆత్మీయ సమ్మేళనం, వర్నిరోడ్డులో మంగళవారం నిర్వహించిన నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ఎన్నికల నగారా మోగిన తర్వాత మొదటి సమావేశం గౌడ కులస్తులతో జరుపుకోవడం సంతోషకరమన్నారు. గత ప్రభుత్వాలు గౌడ కులస్తులను, కల్లు వ్యాపారాన్ని చిన్న చూపు చూశాయని తెలిపారు. ఉద్యమ సమయంలో తెలంగాణ ఏర్పాటైతే గౌడ కులస్తులకు అండగా ఉంటామని కేసీఆర్ చెప్పినట్లు గుర్తుచేశారు. అలాంటి కులవృత్తులను పునరుద్ధరించేందుకు సీఎం కేసీఆర్ విశేషంగా కృషి చేస్తున్నారని, గీత కార్మికులకు ఏమైనా సమస్యలుంటే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం పాలసీగా తీసుకొని ఈత వనాలను పెంచుతున్నదని, మద్యం టెండర్లలో 15 శాతం గౌడ కులస్తులకు రిజర్వేషన్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణేనన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామని, గత ప్రభుత్వాల కాలంలో నిజామాబాద్ నుంచి ఎంతో మంది పెద్దనాయకులు పనిచేశారు కానీ, జిల్లాకు ఒక్కటే బీసీ హాస్టల్ ఉండేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 15 బీసీ హాస్టళ్లను ఏర్పాటు చేశామని, రాష్ట్ర వ్యాప్తంగా 15లక్షల మంది బీసీ బిడ్డలకు ఫీజురీయింబర్స్‌మెంట్ ఇస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో ఉన్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాదని, బీసీల ప్రభుత్వమని చెప్పారు. ఎన్నికలప్పుడు అనేక పార్టీలు వస్తాయని, ఇన్నేండ్లు హాస్టళ్ల సంఖ్య ఎందుకు పెంచలేదో వారిని నిలదీయాలన్నారు. డిసెంబర్ 3 తర్వాత మళ్లీ ఏర్పడేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు.


గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా



నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, వేదికపై అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, మేయర్ నీతూకిరణ్, రెడ్‌కో మాజీ చైర్మన్ అలీం, కార్పొరేటర్లు తదితరులు

## నీరా కేఫ్‌ల ఏర్పాటుకు కృషి చేస్తా..: ఎమ్మెల్యే బిగాల

రాష్ట్రం ఏర్పడిన తర్వాత కులవృత్తుల వారికి సీఎం కేసీఆర్ అండగా నిలిచారని, కల్లు గీత కార్మికులకు ఆసరా పింఛన్లు అందిస్తూ వారి కుటుంబ సభ్యుల్లో ధీమా కల్పిస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. గౌడ కులస్తుల ఆత్మగౌరవానికి ప్రతీకగా గౌడ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, గౌడ భవనానికి ఎమ్మెల్సీ కవిత రూ.50లక్షలు, తాను రూ.50 లక్షల నిధులు మంజూరు చేశామని గుర్తుచేశారు. వృత్తిని నమ్ముకున్న వారి ఆర్థిక వృద్ధి కోసం ప్రభుత్వం హైదరాబాద్‌లో నీరా కేఫ్‌లు ఏర్పాటు చేసిందని, నగరంలో కూడా నీరా కేఫ్‌లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. సొసైటీని రద్దు చేస్తే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పునరుద్ధరించినట్లు గుర్తుచేశారు. నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతూ సెలూన్ షాపులు నిర్వహించుకునే నాయీబ్రాహ్మణులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నదని, అత్యంత బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారన్నారు. నాయీబ్రాహ్మణులకు బీసీ బంధు ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అం దించామన్నారు. వర్ని రోడ్డు నాయీబ్రాహ్మ ణ సంఘానికి రూ.15లక్షలు, వినాయక్‌నగర్ నాయీబ్రాహ్మణ సంఘానికి రూ.10లక్షలు, పట్టణంలో మోడ్రన్ సెలూన్ల నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. లాటరీ ప్రక్రియ ద్వారా షాపులను ఎంపిక చేస్తామని, ఒకవైపు నిజామాబాద్ నగర అభివృద్ధి, మరోవైపు కులసంఘాల అభ్యున్నతికి కృషి చేశామని, నగరంలోని ప్రతి గల్లీలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని, నగర ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదతీరడానికి మినీ ట్యాంక్‌బండ్ నిర్మించామన్నారు. తాము చేసిన అభివృద్ధి మీ ముంగిట ఉన్నదని, మరోసారి అవకాశమిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఎల్లమ్మతల్లి దయతో తనను ఎమ్మెల్యేగా, కవితక్కను ఎంపీగా గెలిపించాలని, ప్రజలకు మరింత సేవ చేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, టీఎస్‌డబ్ల్యూడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రెడ్కో మాజీ చైర్మన్ ఎస్‌ఏ.అలీం, కార్పొరేటర్లు బోడిగం కోమల్, సాయివర్ధన్, బట్టు రాఘ వేందర్, ఉమారాణి, పట్నం విక్రమ్‌గౌడ్, మల్లేశ్ యాదవ్, గౌడ సంఘం నాయకులు సత్యనారాయణగౌడ్, శ్రీనివాస్ గౌడ్, అంబటి శ్రీను, రమణాగౌడ్, నరేందర్‌గౌడ్, నాయకులు అంతరెడ్డి దేవి, భూమేశ్వర్, సీతారాం పాల్గొన్నారు.

## అత్యధిక మెజారిటీతో బిగాలను గెలిపించాలి : వీజీగౌడ్


మాట్లాడుతున్న వీజీగౌడ్

అర్బన్ ఎమ్మెల్యేగా బిగాల గణేశ్ గుప్తాను మరోసారి గెలిపించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీజీగౌడ్ అన్నారు. సీఎం కేసీఆర్ గౌడ కులస్తులను గుర్తించి అనేక సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మద్యం షాపుల్లో 15 శాతం రిజర్వేషన్ కల్పించిన ఏకైక సీఎం కేసీఆర్ అని కొనియాడారు. కల్లుగీత వృత్తి కనుమరుగవుతున్నదని గ్రహించి, హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈత మొక్కలు నాటి కులవృత్తికి న్యాయం చేశారన్నారు. ఎమ్మెల్సీ కవిత గౌడ కులస్తులకు అనేక పథకాలను ఇవ్వాలని సీఎంను కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నీరుగారిన కులవృత్తులకు మళ్లీ జీవం పోశారన్నారు. నగర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

